క్లుప్తంగా

మహంకాళి అలంకరణలో రాజరాజేశ్వరి



మనుబోలు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మనుబోలు కోదండరామపురంలోని పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు గురువారం మహంకాళి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు శ్రీనివాసులు అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. ఉభయకర్తలుగా నాసిన శివకేశ, భాగ్యమ్మ దంపతులు వ్యవహరించారు.

అన్నదాతలకు మేలు



మాట్లాడుతున్న వ్యవసాయాధికారిణి

ముత్తుకూరు: భారీ వర్షాలు వరి, వేరుశనగ రైతులకు ఎంతో మేలు చేశాయని మండల వ్యవసాయాధికారి జోత్స్న రాణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి పొలాల్లో సజావుగా దుక్కులు చేసుకునేందుకు ఈ వానలు దోహదపడతాయన్నారు. కాలువల్లో సాగునీరు విడుదల కాకముందే కురిసిన వర్షాలకు రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారన్నారు. ముందుగానే నార్లు పోసుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని వెల్లడించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

కోవూరు : గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కోవూరులో పల్లె పండగ కార్యక్రమాన్ని ఆమె గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీరోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి, సర్పంచ్ విజయ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నల్లవాగు ఉధృతి



వాగు వద్ద అధికారులు

చేజర్ల: మండలంలోని నల్లవాగు ఉధృతి కొనసాగుతోంది. వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలకు నల్లవాగు పొంగి ప్రవహించడంతో ఎర్రబల్లి గ్రామం నుంచి తూర్పుకంభంపాడు, యనమదల గ్రామాలకు బుధవారం ఉదయం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. కలువాయి నుంచి కాకివాయి మీదుగా చేజర్లకు పోయే మార్గంలోనూ చప్టాపై నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. చేజర్ల నుంచి కలువాయికి కూడా రాకపోకలు స్తంభించాయి. గురువారం వర్షం కాస్తా తెరిపిచ్చినప్పటికీ వాగులు కొనసాగడంతో రాకపోకలు స్తంభించాయి. తహసీల్దార్ మస్తానయ్య, ఎస్సై ప్రభాకర్ నల్లవాగును పరిశీలించారు. వాగు ఉధృతి తగ్గేవరకు ఎవరూ వెళ్లకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా చేజర్ల–సంగం మార్గంలో గొల్లపల్లి వద్ద ఉన్న పందల వాగు ఉధృతి గురువారం మధ్యాహ్నం నుంచి తగ్గడంతో రాకపోకలు కొనసాగాయి.

కావలి డివిజన్‌లో 243.2 మి.మీ వర్షపాతం

కావలి: కావలి డివిజన్ పరిధిలో గురువారం ఉదయం వరకు 243.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని కావలి ఆర్డీఓ ఎం.వంశీకృష్ణ తెలిపారు. జలదంకి 34.6, కావలి 48.4, బోగోలు 15, కలిగిరి 25.8, వింజమూరు 23.6, దుత్తలూరు 18.6, దగదర్తి 12.4, అల్లూరు 10.2, విడవలూరు 27.4, కొడవలూరు 27.2 మి.మీ వర్షపాతం నమోదైందని వివరించారు.

పారిశుధ్య లోపం తలెత్తకుండా చర్యలు

- జెడ్పీ సీఈఓ మోహన్‌రావు

సంగం: వర్షాలు పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య లోపం తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని జెడ్పీ సీఈఓ మోహన్‌రావు తెలిపారు. గురువారం ఆయన మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఎంపీడీఓ షాలెట్‌తో సమావేశమై పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. 15వ ఆర్థిక సంఘం నిధులను ఖర్చు చేసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

ఎప్పటికి పూర్తయ్యేనో..!

భవిష్యత్ తరాలు సైతం ఇబ్బందులు ఎదుర్కోకుండా నిరంతరాయంగా పొదలకూరు పట్టణానికి తాగునీరు సరఫరా చేసేందుకు గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కండలేరు నుంచి ప్రత్యేక పైప్ లైన్ ద్వారా పొదలకూరుకు నీటిని అందించేందుకు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టారు. ఇందుకోసం అప్పటి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎంతో కృషి చేశారు. నేడు ఆ పనులు మందగించాయి.

- పొదలకూరుకు తాగునీరందించేందుకు గతంలో చర్యలు
- కండలేరు నుంచి పైప్‌లైన్ నిర్మాణం
- జల్ జీవన్ మిషన్లో భాగంగా 90 శాతం పూర్తి
- నేడు మందగించిన పనులు
- పట్టణ తాగునీటి అవసరాలు నెరవేరేదెలా?



ప్రత్యేక పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపడుతున్న కార్మికులు (ఫైల్)



పొదలకూరులో తాగునీటి ట్యాంక్ నిర్మాణ పనులు

పొదలకూరు: ఎన్నో సంవత్సరాలుగా పొదలకూరు పట్టణ వాసులు తాగునీటి వెతలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంది. జల్ జీవన్ మిషన్ నిధులు రూ.3.93 కోట్లతో ప్రత్యేక పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారు. ఫిబ్రవరిలో టెండర్ల ప్రక్రియ పూర్తై వేగంగా పనులు జరిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో విడుదలయ్యే నిధులతో తాగునీటి ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయని ప్రజలు భావించారు. వేసవిలో సైతం గ్రామీణ ప్రాంతాల ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కోకుండా నాడు చర్యలు తీసుకున్నారు. అయితే ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడంతో ఈ పనులు మందగించాయి. 90 శాతం పూర్తైన ప్రత్యేక పైప్‌లైన్ నిర్మాణ పనుల్లో జాప్యం నెలకొంది.

మండలంలో..

మండలంలో జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి మంచినీటిని అందించేందుకు మొత్తంగా రూ.17.39 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో అవసరమైన చోట్ల రక్షిత మంచినీటి ట్యాంక్‌లతోపాటు పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి కుళాయిలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఒక్క పొదలకూరు పట్టణ తాగునీటి అవసరాల కోసం రెండు పనులుగా రూ.2.42 కోట్లు, రూ.1.51 కోట్లు మంజూరు చేశారు. శరవేగంగా పనులను చేపట్టేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ ఉన్నత స్థాయి అధికారులు పైపులను దిగుమతి చేయించారు. రాపూరు మార్గం నుంచి పట్టణానికి దాదాపుగా పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. మర్రిపల్లి (దిగువ) గ్రామానికి కూడా మంచినీటిని సరఫరా చేసేందుకు గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను నిర్మించారు. పట్టణంలోని వినాయకమాన్యంలో మంచినీటి ట్యాంక్‌ను నిర్మించి సుమారు 50 శాతం ప్రజలకు మంచినీటి అవసరాల కోసం ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా కండలేరు జలాలను తీసుకొచ్చి సరఫరా చేసేందుకు అంచనాలు వేశారు. మిగిలిన 50 శాతం అవసరాల కోసం పట్టణంలో ఉన్న ట్యాంక్‌ల నుంచి పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేశారు.

34 గ్రామాల ఎంపిక

ఎఫ్‌హెచ్‌టీ (ఫిల్లింగ్ హౌస్‌హోల్డ్ ట్యాప్ కనెక్షన్) కింద ప్రతి ఇంటికీ ఉచితంగా మంచినీటి కుళాయిను బిగిస్తారు. ఇందుకోసం జల్ జీవన్ మిషన్లో భాగంగా 2020లోనే మండలంలో 34 గ్రామాలను ఎంపిక చేశారు. 27 పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేశారు. మిగిలిన వాటికి టెండర్లను నిర్వహించారు. ఇదంతా పూర్తి చేసి అవసరమైన గ్రామాల్లో రక్షిత మంచినీటి ట్యాంక్‌లను కూడా నిర్మించారు. వీటిలో కొన్నింటిని అధికారులు పూర్తి చేయడం జరిగింది. ప్రస్తుతం కండలేరు పాత పైప్‌లైన్ నుంచి పట్టణానికి తాగునీటిని సరఫరా చేస్తున్నా కొంతకాలంగా సక్రమంగా అందడం లేదని పంచాయతీ పాలకులు తెలిపారు. మధ్యలో 12 గ్రామాలున్నా సక్రమంగా నీరు సరఫరా కావడం లేదని పేర్కొంటున్నారు. పాత పైప్‌లైన్ (సీపీడబ్ల్యూ స్కీమ్) నుంచి నీటి సరఫరా నిర్వహణ కోసం త్వరలో కొత్తగా టెండర్లను పిలవడం జరుగుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు.



పాత సీపీడబ్ల్యూఎస్‌లో కండలేరు నీటిని శుద్ధి చేసే సంప్ (ఫైల్)



గిరిజన కాలనీలో కుళాయి కనెక్షన్ (ఫైల్)

పనుల వివరాలు తెలియదు

కొత్తగా బాధ్యతలు స్వీకరించడం వల్ల జల్‌జీవన్ మిషన్ పనుల వివరాలు పూర్తిగా తెలియదు. పనులకు సంబంధించిన రికార్డు హ్యాండోవర్ చేసుకోవాల్సి ఉంది. కండలేరు పాత సీపీడబ్ల్యూఎస్ నిర్వహణ పనులకు త్వరలో టెండర్లను నిర్వహించడం జరుగుతుంది. పైప్‌లైన్ ద్వారా నిరంతరాయంగా మంచినీటిని అందిస్తాం.

– రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ, పొదలకూరు

బుచ్చిలో మద్యం మంటలు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలో నూతనంగా ఏర్పాటవుతున్న మద్యం దుకాణాల విషయమై తెలుగు తమ్ముళ్ల మధ్య విభేదాలు తలెత్తుతున్నాయి. గతంలో తమ వీధుల్లో మద్యం దుకాణాలు వద్దంటూ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి స్థానికులు ఫిర్యాదు చేశారు. ఆయా ప్రదేశాల్లో మద్యం దుకాణాలను ఏర్పాటు చేయబోమని ఎమ్మెల్యే సైతం హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే బుధవారం స్థానిక శాంతినగర్ వద్ద మద్యం దుకాణం ఏర్పాటు విషయమై ప్రజల నిరసనతో పోలీసులు రంగ ప్రవేశం చేసి షాపును మూయించి వేశారు. అదే విధంగా జొన్న వాడ సెంటర్ సమీపంలో ఏర్పాటు చేసిన షాపు విషయమై గురువారం తహసీల్దార్, ఎక్సైజ్ సీఐలతో స్థానికులు అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ వినతి పత్రం అందజేశారు. ఈ రెండు షాపుల ఏర్పాటు విషయమై రూరల్ మండలంలోని ఓ తెలుగుదేశం నేత కీలకపాత్ర పోషించినట్లు ఆ పార్టీలోనే ఆరోపణలు వెల్లువెత్తాయి. శాంతినగర్‌కు చెందిన తెలుగుదేశం నేత వింజం రామానాయుడు, రూరల్ మండలానికి చెందిన తెలుగుదేశం నాయకుడు ప్రజల నిరసనలను కూడా లెక్క చేయకుండా మద్యం షాపులకు నేతృత్వం వహిస్తున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు వెళ్లినట్లు తెలిసింది. రెండు షాపుల భవన యజమానులకు అడ్వాన్సులు ఇవ్వడం, అగ్రిమెంట్లు చేయించడం కూడా ఆ నాయకుడి కనుసన్నల్లోనే జరగడంతో టీడీపీలో ప్రకంపనలు మొదలయ్యాయి. ఇప్పటికే టీడీపీలో నాలుగు వర్గాలు ఉండగా తాము ఏ వర్గంలో పనిచేయాలో తెలియని స్థితిలో ఉన్నామని ఆ పార్టీ కార్యకర్తలు వాపోతున్నారు.

ఎమ్మెల్యే పర్యటన

పొదలకూరు: సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గురువారం స్థానిక ప్రభుత్వ నిమ్మ మార్కెట్ యార్డులో పర్యటించారు. భారీ వర్షాలకు యార్డులో డ్రెయినేజీలు బ్లాక్ అయ్యి వర్షపునీరు దుకాణాలను ముంచేయడంతో సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సంబంధిత మార్కెటింగ్ శాఖ ఏడీతో మాట్లాడారు. సోమిరెడ్డి వెంట నాయకులు ఎస్కే జమీర్, భాస్కర్‌రెడ్డి, నిమ్మవ్యాపారులు ఉన్నారు. మండలంలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు వెంపులూరు పుల్లయ్య గౌడ్ ఇటీవల మృతిచెందారు. ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు.

పేదరిక నిర్మూలనకు కృషి చేద్దాం

- వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం: 'సమాజంలో పేదరికం ప్రధాన సమస్యగా మారింది. దీని నిర్మూలనకు అందరం కృషి చేద్దాం' అని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ పేదరిక నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో గురువారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ పేదరికం వల్ల ప్రజలు విద్య, ఆరోగ్యం, ఆర్థిక భద్రత వంటి అంశాల్లో వెనుకబడిపోతారని తెలిపారు. విద్య పేదరికం నుంచి బయటపడేసి, సమాజంలో స్థిరమైన భవిష్యత్ ఇవ్వగలదని పేర్కొన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ పేదరికం సమాజంపై ఎంతగానో ప్రభావం చూపుతోందన్నారు. విద్యతోపాటు మహిళా సాధికారిత, సామాజిక న్యాయం, సమానత్వం, వంటి అంశాలు పేదరికాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. స్టడీ టూర్ ప్రోగ్రామ్‌లో భాగంగా వీఎస్‌యూను సందర్శించిన డీకే డబ్ల్యూ జూనియర్ కళాశాల విద్యార్థులను వీసీ, రిజిస్ట్రార్ తదితరులు అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్ శంకర్, ఎన్ఎస్ఎస్ యూనిట్ – 4 ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బీపీటీ 5204' వరి నార్లు అనుకూలం

- ఏఓ లక్ష్మి



మిక్కిలింపేటలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు, రైతులు

కొడవలూరు : ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో బీపీటీ 5204 రకం వరి నార్లను పోసుకునేందుకు ఎంతో అనుకూలమని ఏఓ సీహెచ్ఎస్.లక్ష్మి సూచించారు. మండలంలోని మిక్కిలింపేట, కొత్త వంగల్లులో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మిక్కిలింపేటలో మాట్లాడుతూ ఆర్ఎన్ఆర్ 15048 రకం వరి నార్లు పోసుకునే రైతులు నవంబర్ 15వ తేదీ తరువాత అనుకూలంగా ఉంటుందన్నారు. ప్రస్తుత వర్షాలకు నారు మళ్లలో వర్షపు నీరు నిలిచి ఉంటే వెంటనే బయటకు పంపుకోవాలని సూచించారు. లేనిపక్షంలో నారుమళ్లు దెబ్బతిని రైతులు నష్టపోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోడూరు చంద్రశేఖర్‌రెడ్డి, జేవీఓ వెంకటేశ్వర్లు, వీఏఏలు సీహెచ్.వంశీకృష్ణ, జి.మౌర్య, వీపీఏ రాఘవేంద్ర, రైతులు పాల్గొన్నారు.

యార్డులో నీట మునిగిన దుకాణాలు



యార్డులో దుకాణాల వద్ద వర్షపునీరు

- డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

పొదలకూరు: భారీ వర్షాలకు స్థానిక ప్రభుత్వ నిమ్మ మార్కెట్ యార్డు దుకాణాలు నీట మునిగాయి. డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా ఉండడంతో నీరు వెలుపలికి వెళ్లేందుకు వీలులేకుండా పోయింది. ఎప్పుడు భారీ వర్షం కురిసినా ఇక్కడ కొన్ని షాపులు మునుగుతున్నాయి. గతంలో అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టారు. దుకాణాల కంటే రోడ్డు ఎత్తులో ఉండడమే దీనికి కారణం. షాపుల్లో నుంచి నీరు వెలుపలికి వెళ్లేందుకు డ్రెయినేజీ వ్యవస్థ ఉన్నా పూడిక, చెత్తాచెదారంతో నిండిపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. నీరు చేరి కాయలు దెబ్బతిన్నట్టు వ్యాపారులు వాపోతున్నారు.

ఈ మేరకు మార్కెటింగ్ శాఖ ఏడీ అనితాకుమారికి సమాచారం అందించారు.

నిండిన కల్యాణపురం చెరువు

పొదలకూరు: భారీ వర్షాలకు మండలంలోని కల్యాణపురం పాట్లేళ్లవాగు చెరువు నిండింది. గురువారం కలుజు కూడా పారుతున్నట్టు రైతులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఏఈ అనిల్ కుమార్ మాట్లాడుతూ మండలంలో కల్యాణపురం చెరువు ఒక్కటే నిండినట్టు చెప్పారు. మిగిలిన చెరువుల్లోకి 25 శాతం నీరు మాత్రం చేరిందన్నారు.

బాబా మందిరంలో పూజలు



పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం భజనలు, పల్లకి సేవ నిర్వహించారు.

నిర్ణీత సమయంలో టీకాలు వేయాలి



క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న డాక్టర్ ఉమామహేశ్వరి

ఇందుకూరుపేట : వ్యాధి నిరోధక టీకాలను నిర్ణీత సమయానికి వేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి సూచించారు. మండలంలోని జగదేవిపేట పీహెచ్‌సీ పరిధిలో ఉన్న డేవిస్‌పేట, ఇందుకూరుపేట గ్రామాల్లో టీకాలు వేయడాన్ని ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేకంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి, సంచార జాతుల గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వారికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందించేలా చూడాలన్నారు. టీకాలు ఎలా వేస్తున్నారు.. గర్భిణులకు పరీక్షలు ఎలా చేస్తున్నారన్న విషయాన్ని వారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు బ్రహ్మేశ్వరనాయుడు, కిశోర్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



కార్యదర్శి ప్రసాద్‌ను అభినందిస్తున్న ఉప సర్పంచ్

మనుబోలు: అధికారులు రాజకీయాలకతీతంగా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సర్పంచ్ కట్టుమూరి నాగమ్మ, ఉప సర్పంచ్ ఆవుల తులసీరామ్ కోరారు. మండలంలోని జట్ల కొండూరు పంచాయతీ కార్యాలయంలో గురువారం పంచాయతీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డు సభ్యులు వారి పరిధిలో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శి చెంచుప్రసాద్‌ను ఈ సందర్భంగా సన్మానించారు. సమావేశంలో వార్డు సభ్యుడు, స్కూల్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓను కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు



ఎంపీడీఓను సన్మానించిన నేతలు

ముత్తుకూరు: మండల ఎంపీడీఓగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన నాగమణిని గురువారం వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు స్థానిక కార్యాలయంలో కలిశారు. పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ గండవరం సుగుణ, మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య, నాయకులు గండవరం సూరి, షేక్‌మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట : మండలంలోని సముద్రతీర ప్రాంతమైన మైపాడు పడమరపాళెంలో బంగారమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.82 లక్షలతో సిమెంట్ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌సీఐ మాజీ డైరెక్టర్ దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, వీరేంద్రనాయుడు, జెడ్పీ వైస్ చైర్మన్ జయలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీరందక అల్లాడిపోతున్నాం



తాగునీటి కోసం ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

- గ్రామస్తుల ఆందోళన

మనుబోలు: మూడు రోజులుగా పంచాయతీ కుళాయిల ద్వారా తాగునీరు రావడం లేదంటూ మండలంలోని బండేపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఆందోళన చేశారు. అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో పొలాల్లో విద్యుత్ స్తంభం ఒరిగిపోయి సరఫరాకు అంతరాయం కలిగింది. త్రీఫేజ్ విద్యుత్ సరఫరా లేకపోవడంతో మినీ వాటర్ స్కీమ్ పనిచేయలేదు. దీంతో పంచాయతీ కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోయారు. తాగునీటి కోసం ఒకటిన్నర కిలోమీటర్ దూరంలో ఉన్న ఓ ఫ్యాక్టరీ వద్ద నుంచి అతికష్టం మీద తాగునీరు తెచ్చుకుంటున్నామని తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.